# భిక్షుకి

రఘునాథరావుగారి బంగళా మెర్క్యురీ లైట్ల వెలుగులో మిలమిల మెరసిపోతోంది. బంగళాకి ముందున్న తోటంతా అతిథులతో నిండిపోయి వుంది. సన్నగా, శ్రావ్యంగా వీణాగానం గాలిలో తేలివస్తోంది.

ఆనాడు వేదవతీ, రఘునాథరావుల వివాహ రజితోత్సవ దినం. ఆ సందర్భంగా జరుగుతున్న విందు, వినోదాల్లో పాల్గొనేందుకు ఆ పట్నంలోగల పెద్దలందరూ విచ్చేశారు. చీమల బారుల్లా, రంగు రంగుల కార్లు వీధి నిండుగా నిలచి వున్నాయి.

వచ్చిన అతిథులంతా ఆ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ కానుకలందిం చారు. రఘునాథరావు ఆ వూరిలో బాగా పేరుపడ్డ లాయరు. తాత, తండ్రుల నుంచి వస్తున్న వంశగౌరం, ఎంత ఖర్చు చేసినా తరగని ఆస్తి అతని హోదాని మరికాస్త పెంచి చూపుతాయి. అందరితో మంచిగా, మర్యాదగా నడుచుకుపోయే తత్వం అతనిది. అతని భార్య వేదవతి. అందాలరాసి, అనుకూలవతి. వారిని ఎరుగున్నవారంతా ఆ దాంపత్యాన్ని ఆదర్శప్రాయంగా చెప్పుకొంటారు.

బంధు, మిత్రుల శుభాకాంక్షల మధ్య రఘునాథరావు కెంపులు పొదిగిన రిస్టు వాచి చైన్ భార్యకు కానుకగా అందజేసాడు. కళ్ళు మిరుమిట్లు కొల్పుతున్న రవ్వల ఉంగరాన్ని భర్త వేలికి తొడిగింది వేదవతి. అతిథులంతా ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు.

టీ పార్టీ ముగిసిన వెంటనే సుప్రసిద్ధ వైణికుడు బాలకృష్ణ భాగవతార్ వీణాగానం మొదలయింది. తొమ్మిది గంటలకి రకరకాల పిండి వంటలతో తోటలో వెన్నెల భోజనాలు అవి పూర్తికాగానే మంజులత భరతనాట్య ప్రదర్శనం.

అన్నీ పూర్తయేసరికి ఒంటి గంట దాటింది. వచ్చిన అతిథులంతా ఆ దంపతుల దగ్గర సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు. ఎక్కడ వస్తువులు అక్కడ సరిగాసర్ది నౌకర్లు తరలిపోయరు.

"ఈరోజు బాగా అలసిపోయాను. కాస్త సేపు అలా బయట కూర్చుని వస్తాను. మీరు నిద్రపొండి" అంది వేదవతి.

రఘునాథరావుకి పడుకోవాలనుకొన్న పది నిమిషాల్లో గాఢనిద్రలో మునిగిపోవడం అలవాటు. వేదవతి తిరిగి వచ్చేసరికి అతడు నిద్రపోతున్నాడు. అతని వేలికున్న రవ్వల ఉంగరం ధగధగ మెరసిపోతోంది. ఆమె తన చేతిని ముందుకి చాచి కెంపుల చైన్ చూసుకొంది. ఆ నగ చాలా ఖరీదైనదని దానిని చూసిన ఎవరైనా ఇట్టే చెప్పలరు. అంత పనివాడితనంతో ఎంతో అందంగా వుంది ఆ నగ. కాని వేదవతికి దాని విలువ కన్పించలేదు. చిన్ననాటి నుండి ఆమె పెట్టుకొంటున్న నగల్లో అది ఒకటి. ఇంటిలో ఏ శుభకార్యమైనా,

పండుగైనా భర్త కొనిచ్చే కానుకల్లో అది ఒకటి. ఆమెకు దానిని చూస్తుంటే అంతకు మించి ఏమీ అనిపించలేదు. దానిని చేతి నుంచి తొలగించి టేబిలు మీద పెట్టింది.

నిద్రపోతున్న భర్త వైపు నిదానంగా చూసింది. జీవితంలో అన్యాయం, అక్రమం చెయ్యని మనుష్యులంటే నిద్రాదేవికి ఎంత ప్రేమ! ఎంత అభిమానంగా చెంతచేరి సేదదీరుస్తుంది, అనుకొంది.

పడకగది తలుపు తెరచుకొని మెల్లగా బయటికి వచ్చింది. తిన్నగా లైబ్రరీ గది వైపు నడక సాగించింది. మనసు కలతగావున్న సమయాల్లో ఆమెకి ఓదార్పు ఇచ్చి, సేదదీర్చేవి పుస్తకాలే. కాని ఆ రోజు అక్కడ కూడా ఆమెకి శాంతి దక్కలేదు.

లైబ్రరీని అనుసరించివున్న గది పూజ కోసం నిర్ణయింపబడింది. కాని అందులో దేవతల విగ్రహాలు లేవు. కొన్ని మత గ్రంథాలు, వేదాంత చర్చాసారాలు అయిన మహాత్ముల సుభాషితాలు గల పుస్తకాలు ఉన్నాయి. గోడకి ఆనుకొనివున్న రోజ్‌వుడ్ టేబిలు మీద లైఫ్‌సైజ్ గౌతమ బుద్ధుని వర్ణచిత్రం ఒకటి వుంది. అందులో యశోధర రాహులుడిచేత బౌద్ధసన్యాసి రూపంలో వచ్చిన భర్తకి భిక్ష పెట్టిస్తున్నట్లు వుంది. ఆ ముగ్గురి వదనాల్లో కన్పించే నిర్మలతని గంటల తరబడిగా అలా చూస్తూ కూర్చుంటుంది వేదవతి. దానితో ఆమెకి ఏదో తృప్తి కలిగినట్లు అనిపిస్తుంది.

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా మనశ్శాంతికోసం ఆ బుద్ధమూర్తినే శరణు వేడింది వేదవతి. అలా తదేక దృష్టితో ఆ చిత్రాన్ని చూస్తుంటే ఇంకేదో చిత్రం ఆమె కళ్ళ ముందు మెదిలింది. పక్కనున్న డ్రాయరు తెరచి అందులో భద్రంగా కాగితంలో చుట్టివుంచిన పావలా కానుని చేతిలోకి తీసుకొంది. దానిని ఇటు అటు తిప్పి చూస్తుంటే మరచిపోవాలనుకొన్న ఎన్నో జీవిత పుటలు ఆమె కళ్ళ ముందు కదలాడాయి.

◆ ◆ ◆

కాలేజీ చదువు ముగించి ఇంటికి తిరిగివస్తూ రాజశేఖరాన్ని వెంటబెట్టుకు వచ్చింది వేదవతి. స్నేహితుడంటూ తండ్రికి పరిచయం చేసింది. అతనిని వివాహం చేసుకోవాలనుకొంటున్నట్లు అటు తరువాత నెమ్మదిగా చెప్పింది. రావ్‌బహద్దూర్ దుర్గారావు కూతురి మీద ఎగిరిపడలేదు. మంచి, చెడ్డ నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

"చూడు వేదా! వియ్యానికి, కయ్యానికి సరిసమానులు ఉండాలంటారు. తాత్కాలిక ఉద్రేకాలకి, వ్యామోహాలకి లొంగి చేసుకొనే వివాహాలు సరియైన ఫలితాన్ని ఇయ్యవు తల్లీ" అన్నాడు అనుభవజ్ఞుడైన తండ్రి.

ఆమె తేలిగ్గా నవ్వేసింది. గాంభీర్యంగా ముఖం పెట్టి, "ప్రేమ అన్నిటినీ జయిస్తుంది నాన్నా" అంది.

ఏనాడూ కూతురి మాట కాదనని దుర్గారావు ఆ పెళ్ళికి సమ్మతించాడు.

నిజజీవితంలో అడుగుపెట్టాక సుఖంగా బ్రతికేందుకు ప్రేమ ఒక్కటేకాక మరికొన్ని అవసరం వుంటాయని గ్రహించింది వేదవతి. ఆమె భయంకరమైన ఆ దారిద్ర్యాన్ని భరించలేకపోయింది. అతడు తనవారిని వదలి ఆ ఐశ్వర్య సౌధంలోకి రాలేకపోయాడు.

ఈ రెండింటి మధ్య రాజీ కుదుర్చుకోవాలని ఇద్దరూ ప్రయత్నించారు. కాని ఆ రాజీ మార్గాన అట్టేకాలం నడువలేకపోయారు. ఆనందంగా బ్రతకాలంటే డబ్బు ముఖ్యమని ఆమె వాదన. మనిషిగా బ్రతకాలంటే ఆత్మాభిమానం ముఖ్యమని అతని భావన. మాటలు, వాదోపవాదాలు పెరిగి, మనసులు గాయపడ్డాయి.

సినిమాల్లో, కథల్లో ఆదర్శ వివాహాలు, ప్రేమ వివాహాలు ఎంతో అందంగా త్యాగంతో ముడిపడిన వారి జీవితాలు విడదీయరాని అనుబంధాలుగా కన్పిస్తాయి. కాని నిజ జీవితంలో కాలం గడుస్తుంటే త్యాగానికి ఒక విలువంటూ వుండదు. అప్పటిమట్టుకి ఏదోలా వున్నా అది శాశ్వతంగా నిలవదు. అంతకు మించిన ఏదో ఆవేశం, పట్టుదల మనుష్యులను నడిపిస్తాయి.

అతడు రెండు, మూడుసార్లు వచ్చి పిలిచాడు. రమ్మని కబుర్లు పెట్టాడు. ఆ పసికందుతో నిత్యావసరాలకి కూడా తడుముకోవలసిన ఆర్థిక దుస్థితిలోవున్న ఆ యింటికి వెళ్ళేందుకు ఆమె హడలిపోయింది. తన మనసులోని భయాన్ని తండ్రితో చెప్పింది. ఆమె భయాన్ని పారద్రోలేందుకు, ఆ పరిస్థితిని మార్చేందుకు తండ్రి ప్రయత్నం చేసాడు. కాని ఆయన ప్రయత్నాలేవీ సానుకూలపడలేదు. అక్కడితో ఆగక భార్యాభర్తలు శాశ్వతంగా విడిపోయేందుకు దారితీసాయి.

విడాకుల కేసు కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు అతడు ఏమీ వాదించలేదు. బాబును తన కిప్పించమని మాత్రం కోర్టువారిని అర్థించాడు. కోర్టువారు అతని కోరిక మన్నించి బాబును అతడికి అప్పగించారు.

బాబును విడిచి వుండడం వేదవతికి కష్టమనిపించింది. కొడుకుని ఎలాగైనా తను దక్కించుకోవాలనుకొంది. తన ఆలోచన తండ్రితో చెప్పింది. ఏనాడూ కూతురితో పరుషంగా మాట్లాడని తండ్రి ఆనాడు ఆమెని గట్టిగా మందలించాడు. ఒకసారి తీర్పు యిచ్చిన కేసుని తిరిగి హైకోర్టుకి లాగి అతడిని అగచాట్లపాలు చెయ్యవద్దని కూతురికి హితవు చెప్పాడు.

"అతడు నీకేం పగవాడు కాదు. ఒకనాడు నువ్వు ప్రపంచంలో అన్నిటికన్నా మిన్నగా ప్రేమించా ననుకొన్న వ్యక్తి. బాబు ద్వారా అతడికి ఆపాటి ఆనందం దక్కనీ" అన్నాడు.

నిండా రెండేళ్ళు గడవకుండానే ఆమెకి రఘునాథరావుతో వివాహం జరిగి పోయింది. లక్ష్మీ నివాసంలా వున్న అత్తవారింట మొదటిసారిగా ఆమె కాలు మోపినప్పుడు, ఇరుకు సందుల్లో, చీకటి గదుల్లో రాజశేఖరంతో తను గడిపిన జీవితం ఆమెకి గుర్తుకి వచ్చింది. ఆ దారిద్ర్యం తలపుకి వచ్చేసరికి భయంతో వొళ్ళు జలదరించింది. అందానికి, ఐశ్వర్యానికి ప్రతినిధిలా ఎదుట నిలచిన భర్త వంక చూపు తిప్పి ఆ భయాన్ని బాపుకొంది.

పువ్వుకన్న సుకుమారంగా, గంగాజలంకన్న పవిత్రంగా భర్త ఆమెని చూసుకొనే వాడు. ఇంట్లో దాస దాసీ జనం, ఊళ్ళో గౌరవ మర్యాదలు, తలచిందే తడవుగ ఒడిలో వాలే ఆనందాలు, ఆ జీవితంలో స్వర్గాన్నే చవిచూసింది వేదవతి.

నూట ఏభై రూపాయల గుమాస్తా రాజశేఖరాన్ని, రెండేళ్ళు నిండని బాబుని ఆమె త్వరలోనే మరచిపోయింది. ఎప్పుడైనా గుర్తుకి వచ్చినా ఆనాటి జీవితాన్ని ఈనాటి ఆనందంతో పోల్చుకొనే సమయంలోనే, దారిద్ర్యానికి దగ్గరగా వెళ్ళి, దాని సరసను కాలంగడిపేవరకు తమ యింట మూల్గుతున్న డబ్బు యొక్క విలువ తెలుసుకోలేకపోయింది వేదవతి. డబ్బు ఒక నిషాపదార్థం వంటిది. ఒకసారి అలవాటుపడ్డాక దానిని వదలి వుండడం ఎంతో కష్టం. ఆ నిషాలో జీవితం మత్తుగా, గమ్మత్తుగా అలా సాగిపోతుంది.

ఆ రోజు ఏదో స్కూలులో జరుగబోయే వక్తృత్వపు పోటీలకు అధ్యక్షత వహించడానికి వేదవతిని ఆహ్వానించారు. ఇటువంటి సభలు, సమావేశాల్లో పాల్గొనడం ఆమెకి తరుచు జరుగుతుండే తతంగమే.

వేదికమీద కుర్చీలో కూర్చుని, ఆ పిల్లల వాద ప్రతివాదాలని ముచ్చటగా వింటున్న వేదవతి అక్కడే మొదటిసారిగా బాబుని చూసింది. ఉత్సాహంగా, చొరవగా ఆ పిల్లవాడు అలా మాట్లాడుతుంటే తన చిన్నతనపు స్కూలు రోజులు ఆమెకి గుర్తుకి వచ్చాయి.

సమావేశం పూర్తయాక ఆ పిల్లవాణ్ణి దగ్గరికి పిలిచి పేరు అడిగింది. 'దుర్గారావు' అన్నాడు ఆ కుర్రాడు. ఆమె అడిగిన ప్రశ్నలన్నిటికీ నమ్రతగా జవాబులు చెప్పాడు.

పదకొండేళ్ళ బాబు రూపురేఖల్లో తన పోలికలు కొట్టొచ్చినట్లు కన్పించాయి వేదవతికి. ఆ పిల్లవాడు వేసుకొన్న బట్టల్లో, మాట్లాడుతున్న తీరులో తండ్రి నిరాడంబరత, నిర్మలత కన్పించాయి. తన చేతిలో వున్న పువ్వుల దండ అతనికి అందించింది. "ఇంట్లో ఎవరికిస్తావు?" అంటూ ప్రశ్నించింది.

"నా గదిలో వేలకడతాను" అన్నాడు దుర్గారావు.

"ఏం... మీ వాళ్ళకెవరికీ ఇయ్యవా?" ఆ కుటుంబ పరిస్థితులు తెలుసుకోవాలన్న కుతూహలంతో ప్రశ్నించింది.

"మా యింట్లో ఆడవాళ్ళెవరూ లేరు." అమాయకంగా సమాధానం చెప్పాడు.

"నేను పోవలసింది మీ వీధి మీదుగానే. నా కార్లో ఎక్కు. నిన్ను అక్కడ దింపి పోతాను" అంది ఆమె.

ఆ పిల్లవాడు మొదట్లో కొంచెం సంశయించాడు. చివరకు వొప్పుకొన్నాడు. తోటి పిల్లలు అతడి అదృష్టానికి ఈర్ష్యపడ్డారు. అంత పెద్ద కారులో మెత్తని సీటు మీద ఓ మూలకి వొదిగి కూర్చున్నాడు బాబు.

"మా వీధిలోకి కారు పోదు. రోడ్డు చాలా సన్నంగా వుంటుంది" తన ఇల్లు చేరువ అవుతుంటే తనలో తను అనుకొంటున్నట్లు మెల్లగా అన్నాడు బాబు.

ఆ సందుకి ముందుగా వున్న మెయిన్ రోడ్డు మీద కారు ఆగింది. బాబు తమ యింటి గుమ్మం ఎక్కేవరకు అటు చూసి, "ఇంక పోనీ" అంది వేదవతి డ్రైవరుతో. ఆనాటి యజమానురాలి ప్రవర్తన డ్రైవరుకి ఆశ్చర్యం కలిగించింది. ఆ పేద పిల్లవాడి కోసం ఈ ధనవంతురాలు ఇంత దూరం ఎందుకొచ్చిందా? అని ఆలోచనలో పడ్డాడు.

నిర్మల జలతటాకంలో రాయి పడింది. నిశ్చలంగా ఉన్న మనస్సులో కలత రేగింది.

ఆ పిల్లవాడిని మళ్ళా మళ్ళా చూడాలనే తపన బయలుదేరింది వేదవతి మనసులో. కాని... ఎలా? ఆ పరిసరాలు ఆమె వంటివారు కాలు మోపేందుకైనా అనువైనవి కావు. ఈ విషయం తెలిస్తే ఇంటా, బయటా వింతగా చెప్పుకొంటారు. పనివాళ్లు పసికడితే చులకనగా మాట్లాడుతారు.

ఒకటి, రెండుసార్లు స్నేహితులతో మాట్లాడుతూ వెళ్ళిపోతున్న బాబుని దూరం నుంచి చూసింది. దగ్గరికి పిలిచి మాట్లాడాలంటే ప్రక్కన భర్త ఉన్నాడు. ఇంకొకసారి బాబుతో ఒక నడివయసులో వున్న వ్యక్తిని చూసింది. అతడు రాజశేఖరమేనా? ఎందుకంత బలహీనంగా ఉన్నాడు? మరీ వయసు మీరిన వాడిలా అలా నడు స్తున్నాడేం?

కారు వాళ్ళిద్దర్నీ దాటిపోతుంటే క్షణకాలం ఆ మూర్తి ఆమె కళ్ళలో మెరసింది. అతడు రాజశేఖరమే! మనిషి ఎంతగా మారినా ముఖంలోని నిర్మలత్వం లోపించలేదు. కొడుకు చెప్పిన ఏదో విషయం విని, ఆప్యాయంగా ఆ పిల్లవాడి తల నిమురుతున్నాడు.

ఒకరోజు... ఆ రోజు ఆమె జీవితంలో మరచిపోలేని రోజు... ఆ రోజు ఆమె మనసులోని చీకటి వెలసిపోయిన రోజు...

బయట చీకటిగా ఉంది. ఆ పాత పెంకుటి ఇంటి గుమ్మంలోంచి దీపం వెలుగు సన్నగా బయట పడుతోంది. ఓరవాకిలిగా తెరచి ఉన్న తలుపు సందులోంచి ఇంటిలో కొంత భాగం కన్పిస్తోంది గదిలో ఒక మూలగా చిన్న టేబిలు, ఎదురుగ చేతులు విరిగిన కుర్చీ, పక్కగా గోడకి మేకులు కొట్టిన బట్టల స్టాండు, దానికి వేలాడుతున్న ఒకటి, రెండు జతల బట్టలు, పక్కపక్కనే వెయ్యబడ్డ రెండు నులక మంచాలు, వాటిమీద గుడ్డ పెట్టి దూది బయట పడుతున్న రెండు పరుపులు. ఇవీ ఆ గదిలో సామాన్లు.

బాబు పక్క దులిపి పరచి, "పడుకో నాన్నా" అన్నాడు.

ఆ తండ్రీ కొడుకుల ముఖాలు ఎందుకో వాడి ఉన్నాయి. ఏదో సమస్య వారి బతుకుల మీద విరుచుకుపడినట్లు ఆందోళన పడుతున్నారు.

తెరచి ఉన్న వీధి గుమ్మంలోంచి వస్తున్న గాలికి గోడకి తగిల్చి ఉన్న హరికేన్ లాంతరు వూగుతున్నది. పాతబడి, తుప్పు పట్టిన ఆ లాంతరు బర్నరు సరిగాలేక గాలి ఒత్తిడికి దీపం ఉండుండి భగభగ మండుతోంది.

"ఆ తలుపు వేసిరా దుర్గా! గాలికి దీపం మండి చిమ్నీ అంతా మసిబారి పోతోంది" అన్నాడు రాజశేఖరం.

బాబు గుమ్మం వైపు వస్తున్నాడు. తను అతడి కళ్ళపడక ముందే చప్పుడు కాకుండా తప్పుకోవాలనుకొంది వేదవతి. ఆ కంగారులో కాళ్ళకి చీరె కుచ్చెళ్ళు అడ్డుపడి తొట్రుపడ్డది. గుమ్మానికి పక్కగా ఉన్న ఎండి ఎంగిలాకులమీద ఆమె కాలు పడ్డది. ఎండిన ఆకులు ఆమె కాళ్ళకింద గలగలమన్నాయి.

"ఎవరది?" ముందుకి చూస్తూ ప్రశ్నించాడు బాబు.

తను ఎవరని చెప్తుంది? తలమీది ముసుగు మరికాస్త ముందుకు లాక్కొంది.

"ఎవరు దుర్గా?" లోపలి నుండి తండ్రి ప్రశ్నించాడు.

"ఎవరో ముష్టిది లాగుంది."

ఆ చీకటిలో, తల మీదుగా వేసుకొన్న ముసుగులో ఆమె మెడలో ధగధగ మెరుస్తున్న వజ్రాలహారం బాబుకి కన్పించలేదు. రవ్వల దుద్దుల మెరుపు చూడలేదు. దూరంగా ఉన్న అతని చేతికి ఆమె కట్టిన పట్టుచీర మెత్తదనం తగులలేదు.

"ఏదైనా ఇచ్చి పంపించు" లోనుండి రాజశేఖరం మాట విన్పించింది.

"ఇయ్యడానికి ఈ సమయంలో ఏమున్నాయి? భోజనాలు కూడా అయిపోయాయి కదా..."

ఆ తండ్రీ కొడుకుల మధ్య క్షణకాలం నిశ్శబ్దం నిలిచింది.

"చూడు దుర్గా! ఆ చారల లాల్చీ జేబులో ఓ పావలా కాసు ఉండాలి. ఆమెకి ఇచ్చి పంపు."

బాబు తండ్రి దగ్గరికి వెళ్ళి మెల్లగా అంటున్నాడు. "రేపటికి అదే మిగిలింది నాన్నా!"

"ఫరవాలేదు దుర్గా! ఈ రోజు నువ్వు ఒకరికి భిక్షం పెడితే, రేపు నీకు ఇంకొకరు సహాయపడ్తారు. ఈ పరిస్థితిలో ఆ పావలా కాసు ఉండి మనల్ని ఉద్ధరిస్తుందా? ఆమెకి ఇచ్చి పంపు. ఏదో ఇంత కొనుక్కుతిని, ఇన్ని మంచినీళ్ళు తాగుతుంది" అన్నాడు రాజశేఖరం.

అతడి కంఠంలో దీనత్వం లేదు. రేపు గురించిన బెంగ అసలే లేదు. ఈ రోజు తన దగ్గర పావలా కాసు ఉంది. ఎవరో భిక్షకురాలు ఆశతో గుమ్మంలో నిలచి ఉంది. కళ్ళ ఎదుట ఉన్న ఆ సత్యాన్ని మాత్రమే గుర్తించినట్లుంది అతడి మాట.

తండ్రి జేబులోంచి పావలా కాసు తెచ్చి ఆమెకి ఇచ్చాడు బాబు. అది ఆమెకో పెన్నిధిలా అనిపించింది. దానిని తన నుండి ఎవరైనా దోచుకుపోతారేమో అన్నట్లు గుప్పిట బంధించి ఇంటి దిక్కుగా వడివడిగా నడక సాగించింది.

ఇల్లు చేరేసరికి ఆమె బట్టలు చెమటతో తడిసిపోయాయి. అలసటతో ఊపిరి అందలేదు.

"ఏమయింది? ఏమయింది?" భర్త, పరిజనులు చుట్టుముట్టారు. రెండు మూడు నిముషాల్లో ఆమె తేరుకొంది.

"షికారు పోవాలనుకొంటే హాయిగా కారు మీద పోకూడదా? నడక నీ ఒంటికి మంచిది కాదంటే వినవు. చూసేవా ఏ పరిస్థితిలో తిరిగి వచ్చావో? ఇంకెప్పుడూ ఇటువంటి పిచ్చిపనులు చెయ్యకు" ప్రేమగా మందలిస్తూ ఆమెని పక్కమీద పడుకో బెట్టాడు భర్త.

ఆ రాత్రి ఆమె మనసు, శరీరం చిన్నా భిన్నం అయిపోయాయి. ఆమెకి తెలివి వచ్చి కళ్ళు తెరచేసరికి కేలెండరులో ఒక నెల తిరిగిపోయింది.

"ఏ దేవుడు నా మొర విన్నాడో ఈనాటికి నీకు నయమయింది. నువ్వు నాకు దక్కవేమో అని ఎంతగా హడలిపోయాను!" అంటూ భర్త ఆప్యాయంగా ముంగురులు సవరిస్తుంటే, ప్రేమగా కళ్లలోకి చూస్తుంటే జరిగిన సంఘటనలన్నీ ఆమె మరచి పోయింది. అతని మంచి హృదయంలో, ఆ ప్రేమలో ఆమె కరగిపోయింది.

మరో నెల రోజులు గడిచేసరికి ఎప్పటి ఆరోగ్యం కోలుకొంది. ఆ రోజు బజారుకి పోయి బట్టలు కొనుక్కురావాలని బయలుదేరింది వేదవతి. హేండ్‌బ్యాగ్ తెరచేసరికి అందులో ఆ పావలాకాసు పదిలంగా ఉంది.

ఆనాటి జ్ఞాపకం సూదంటురాయిలా ఆకర్షించి ఆమెని అటు నడిపించింది. మెయిన్ రోడ్డు మీద కారుని ఆపించి ఆమె ఆ ఇంటికి చేరుకొంది. గుమ్మానికి తాళం పెట్టి ఉంది. ఈ తండ్రీ, కొడుకూ ఎక్కడికెళ్లారు? లేక ఇల్లుకాని మార్చేరా?

ఆలోచనగా ఆ గుమ్మం వంక చూస్తూ నిలబడిపోయింది వేదవతి. పెద్దింటి పడుచు ఆ ఇంటి గుమ్మం ముందు నిలచి ఉండడం వీధిలో వారికి ఆశ్చర్యం కలిగించింది.

"ఈ ఇంట్లో ఒక తండ్రీ, కొడుకూ ఉండేవారు..."

"మీ కేమైనా చుట్టాలా?" అక్కడ చేరినవారలో ఒకరు ప్రశ్నించారు.

'అవును' అనలేక కాదన్నట్లు బుర్ర ఆడించింది ఆమె.

"ఆయన్ను జెయిల్లో వేసారు."

అదిరిపడి చూసింది వేదవతి.

"అవునమ్మా! డబ్బు చాలకపోతే మీవంటి కలిగిన వారి వద్ద అప్పో, సప్పో చేసుకోవాలి. కాని సర్కారు సొమ్ము తిని కూర్చుంటే ఊరుకొంటారా? బ్యాంకులో సొమ్ము కాజేసాడట. పైకి మాత్రం ఎంతో నీతిమంతుడిలా, మర్యాదస్తుడిలా ఉంటాడు! ఈ రోజుల్లో ఎవ్వర్నీ నమ్మేందుకు లేదు."

ఆమెకు ఇంకా వారి మాటలు వినాలని లేదు. విసవిస నడుచుకొంటూ వెళ్ళిపోయింది. మర్నాడు డైరీ తీసి బాబు చదువుకొంటున్న స్కూలు ఎడ్రసు నోట్ చేసుకొని బయలుదేరింది. హెడ్మాష్టరు ఆమెని ఆదరణతో ఆహ్వానించాడు. ఆమెకి కావలసిన భోగట్టా సేకరించాడు.

ప్రస్తుతం బాబు అక్కడ చదవడం లేదు. టి.సి. తీసుకొని వెళ్లిపోయాడు. అంతకుమించి వారి నుంచి ఏమీ తెలుసుకోలేక పోయింది. నిరాశగా వెనక్కి తిరిగి వచ్చింది.

ఆనాడు ఆమె పుట్టిన రోజు. ఉత్సాహంగా ఉండవలసిన ఆ రోజున ఆమె అలా వాడిపోయి ఉండడం చూసి, ఇంకా బాగా ఆరోగ్యం కోలుకోలేదు అనుకొన్నాడు ఆమె భర్త. చిత్రకారుడైన ఒక మిత్రుడు బుద్ధుని వర్ణచిత్రాన్ని ఆమెకి పుట్టినరోజు కానుకగా ఇచ్చాడు. అందులో ఆమెకి బుద్ధుడు, రాహులుడు, యశోధర కన్పించలేదు. తను, బాబు, రాజు కన్పించారు.

ఆ చిత్రంలోని బుద్ధుని మూర్తి ఆమె హృదయంలో హత్తుకుపోయింది.

అతడు కన్నకొడుకుని, సహధర్మచారిణిని ఎంత నిష్కామంగా చూస్తున్నాడు? దేశ కల్యాణం కోసం, మానవ సౌభాగ్యం కోసం అతడు రాజరికాన్ని, అనురాగవతి యైన భార్యను, అల్లారు ముద్దుల కుమారుని విడిచి వెళ్లిపోయాడు. కాని తనో, తనేం చేసింది?

◆ ◆ ◆

పల్చటి కిటికీ తెరలను తప్పించుకొని సూర్యకాంతి గదిలో ప్రవేశించింది. బద్ధకంగా రఘునాథరావు కళ్లు విప్పాడు. పక్కమీద భార్య లేదు. అసలు ఆ రాత్రి ఆమె అక్కడ పడుకొన్న గుర్తులేలేవు. అటువంటి సమయాల్లో ఆమె ఎక్కడ వుంటుందో అతడికి తెలుసు. తిన్నగా లైబ్రరీ గదివైపు సాగాయి అతని కాళ్లు.

రాత్రి బాగా పొద్దుపోయేవరకు ఏదో ఒకటి చదువుతూ అక్కడే సోఫాలోపడి అలా నిద్రపోవడం ఆమెకి అలవాటే. "అంతరాత్రి వరకు మేలుకొని ఉండడం నీ ఆరోగ్యానికి మంచిది కాదు" అంటూ భర్త వారిస్తాడు. అయినా ఆమె పట్టించుకోదు. ఒక్కొక్క రోజున ఆమెకి తిక్కరేగుతుంది. అటువంటి సమయంలో ఎవరేం చెప్పినా ఆమె వినిపించుకోదు. సరిగా తిండి తినదు. నిద్రపోదు. ఏదో ఆలోచిస్తూ ఏకాంతంగా గడిపివేస్తుంది.

రఘునాథరావు లైబ్రరీ గదిలో ఆమె కోసం ఇటు అటు కలయజూసాడు. ఆమె అక్కడ లేదు. కిటికీలోంచి లోపలికి చూసాడు. తోటమాలి ముందురాత్రి మనుష్యుల కాళ్ళ కింద నలిగిన లాన్‌లోని గడ్డిని సరిచేస్తున్నాడు.

"వెంకన్నా, అమ్మగారు అక్కడ ఉన్నారా?" అంటూ కేకవేసాడు.

వెంకన్న లేచి నిలబడి, "లేరు బాబూ" అన్నాడు వినయంగా.

అటు నుంచి తిరిగి వస్తుంటే పక్కగా ఉన్న చిన్నగదిలో కన్పించింది వేదవతి. రోజ్‌వుడ్ టేబిలు మీద ఉన్న ఆ బుద్ధ మూర్తికి ఎదురుగా కూర్చీలో కూర్చుని టేబిలుపై తల ఆన్చి నిద్రపోతోంది. ఆమె చేతులు బుద్ధుని పాదాల ముందు పెట్టి అర్థిస్తున్నట్లు చాచబడి ఉన్నాయి. పచ్చని ఆమె బుగ్గల మీద పడ్డ లేఎండ కాంతిలో కన్నీటి చారికలు మలినంగా కన్పిస్తున్నాయి.

లేతగులాబి రంగులో సున్నితంగా ఉన్న ఆమె చేతిలో పాతబడి, మకిలిపట్టిన ఒక పావలా కాసు ఉంది.

మొదట ఏమీ అర్థం కానట్లు ఇటు, అటు చూసాడు అతడు.

తలవాల్చి ఏదో అర్థిస్తున్నట్లున్న భార్యని చూసాడు. చేయెత్తి రాహులుని దీవిస్తున్న బుద్ధమూర్తిని చూసాడు. అతనికి ఏదో అంతా అర్థమైనట్లే అనిపించింది. ఏమి తెలియ వచ్చిందో, దాని అంతరార్థం ఏమిటో మాత్రం స్పష్టంగా గోచరించలేదు. అయినా ఏదో తృప్తి. భార్య కోరినదేమిటో ఆమెకి లభ్యమయి ఉంటుందన్న సంతృప్తి.

వేదవతి మనసుకి శాంతి కలిగిందా? ఆ రాత్రి ఆ కార్చిన కన్నీరు హృదయాన్ని తేలిక పరచిందా?

అది ఆమెకే తెలియాలి, ఆమె మనసుని అర్థం చేసుకొన్న ఆ బుద్ధమూర్తికి తెలియాలి.